

అక్రమ నిర్మాణాలు ఆపండి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి: కార్పొరేషన్ పరిధిలోని చిన్నచౌక్ పంచాయతీ బుడ్డాయపల్లికి సమీపంలోని చంద్రవర్ధినగర్‌లో నిబంధనలు ఉల్లంఘించిన అపార్టుమెంట్ల నిర్మాణాలు చేపడుతున్న యాజమాన్యాలు అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. గురువారం పలువురు కమిషనర్‌కు వినపత్రం అందజేశారు. గతంలో మున్సిపల్ నిబంధనలకు అను గుణంగా తాము నిర్మించుకున్న ఇళ్లు, డ్రెయినేజీ వ్యవస్థలను విస్మరించి సొంతనిధులతో పెద్దఎత్తున చేపడుతున్న రోడ్ల విస్తరణ, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు, రోడ్డుకు మించిన ఎత్తులో భవనాల నిర్మాణ పనులు చేపడుతున్నారని వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలు పాటించకుండా సంపన్నులకు ఎటువంటి చట్టాలు వర్తించవనే ఉద్దేశంతో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించి జెసిబిలతో పెద్దఎత్తున డ్రెయినేజీ పైప్‌లైన్ నిర్మాణాలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణాలు చేపడితే తమ ఇళ్లలోకి వరద నీరు చేరే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

తాగునీరు @రూ.500

- 2వ డివిజన్ సిబ్లాక్‌లో ట్యాంకర్ల జోరు
- బావులుగా మారిన కాలనీ రహదారులు
- ఎగుడుదిగుడు గుంతలతో కాలనీవాసుల ఫీట్లు
- వైఎస్ఆర్‌నగర్, జగనన్న కాలనీలో దాహం కేకలు
- 7న కార్పొరేషన్ ఎదుట సిపిఎం భారీ ధర్నాకు కసరత్తు

కడప కార్పొరేషన్ శివారులోని వైఎస్ఆర్ నగర్ కాలనీలో దాహం కేకలు మిన్నంటాయి. కార్పొరేషన్ అధికార యంత్రాంగం సంపన్నులు, సామాన్యులు అనే తేడా లేకుండా పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తోంది. ద్వారకానగర్, పటేల్‌రోడ్డు, ఓంశాంతినగర్ తదితర సంపన్నుల నివాస ప్రాంతాలతో సమానంగా మౌలిక సదుపాయాలను శివారు కాలనీలకు కల్పించడంలో విఫలమవుతోంది. వారం రోజుల కింద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర రెండవ డివిజన్ పరి ధిలోని వైఎస్ ఆర్‌నగర్ కాలనీలో పర్యటించింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాలనీలోని సమస్యలను చర్చనీయాంశం చేసింది. సమస్యల పరిష్కారానికి నోచని తీరు ఎలా ఉందనే అంశంపై గురువారం ప్రజాశక్తి పర్యటించిన సందర్భంగా తాగునీటి కొనుగోలు వ్యవహారం, బావులను తలపించిన రహదారులు, అధ్వాన డ్రెయినేజీ వ్యవస్థ, ఎండియు వాహనాల నిర్లక్ష్యంతో రేషన్ బియ్యం గగనం వంటి కనీస సమస్యలు పరిష్కారానికి నోచని నేపథ్యంలో ఈ నెల ఏడున కార్పొరేషన్ ఎదుట భారీ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కథనం...



రోడ్డుకు అడ్డంగా ఉన్న దిగుడుబావి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కార్పొరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ సమస్యలకు పుట్టినిల్లుగా మారింది. వైఎస్ఆర్ నగర్ కాలనీ ఎ, బి, సి బ్లాకులుగా ఏర్పడింది. 2006లో వైఎస్ఆర్ కాలనీ ఎ బ్లాక్, 2008లో బి బ్లాక్, 2010లో సి బ్లాక్ పరిధిలో జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. వైఎస్ఆర్ నగర్ కాలనీలో 800 నుంచి 1200 కుటుంబాలు ఉన్నాయి. సి.బ్లాక్ కాలనీలోని సుమారు 400 పక్కా గృహాలలో 100 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 100 కుటుంబాలు ఐదు రోజులకు ఒకసారి ట్యాంకర్ రూ.500 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈలెక్కన ప్రతి కుటుంబం నెలకు రూ.3 వేలు చొప్పున నీళ్ల కోసం ఖర్చు చేయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. కనీస సదుపాయాల్లో కరెంటు సదుపాయాన్ని మినహాయిస్తే తాగునీటి పైప్‌లైన్ దగ్గర నుంచి డ్రెయినేజీ, రహదారుల నిర్మాణం మొదలగు కనీస సదుపాయాలకు నోచుకోలేదు. ఔటర్ రింగురోడ్డు నుంచి వెళ్లే ప్రధాన రహదారిని మినహాయిస్తే డివిజన్ ఎటువంటి పురోగతికి నోచుకోలేదు. సిపిఎం నగర కమిటీ చేపట్టిన ప్రజా చైతన్యయాత్రలో ప్రధాన సమస్యలను గుర్తించింది. కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కార్పొరేషన్ అధికార యంత్రాంగం పన్నుల సేకరణకు ముందు వరుసలో ఉంటూ శివారు కాలనీల్లో సదుపాయాల కల్పనకు వెనకవరుసన ఉంటోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది.



పైప్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఉన్న నిరుపయోగంగా నీళ్ల ట్యాంకు

బావులే...రహదారులు

వైఎస్ఆర్ నగర్ కాలనీలోని ఎ బ్లాక్‌లో 400 కుటుంబాలు ఉన్నాయి. నాలుగు ప్రధాన రహదారులు బావులను తలపిస్తున్నాయి. సి బ్లాక్‌లోని ప్రధాన రహదారిలోనే భారీ వ్యవసాయ బావి ఉంది. దీని పూడ్చివేతకు సైతం చొరవ తీసుకోని నిర్లక్ష్యం గడ్డం కట్టింది. ఇక్కడి ప్రధాన వీధుల గుండా గర్భిణులు, ముదుసళ్లు ఆస్పత్రులకు వెళ్లకుండానే కాగల కార్యం గంధర్వులు తీర్చిన సామెత స్ఫురణకు వస్తోంది. అంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో ఎవరికి వారే అర్థం చేసు కోవాలి. తాగునీరు, డ్రెయినేజీ వంటి సమస్యలు ఎప్పటికి పరిష్కారమవుతాయో ఎవరికీ తెలియని పరిస్థితి కనిపిస్తోంది.

రేషన్..పరేషాన్

వైఎస్ఆర్‌నగర్ కాలనీకి చలమారెడ్డిపల్లికి చెందిన డీలర్ 400 కుటుంబాలకు సరిపడా ఎండియు వాహనం ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి కాలనీలో 800 కుటుంబాలున్నాయి. ప్రతినెలా 400 కుటుంబాలకు రేషన్ సరుకులు అందని పరిస్థితి కనిపిస్తోంది. కడప కార్పొరేషన్ పరిధిలో రేషన్‌కార్డు మ్యాపింగ్ అయిన ప్రాంతానికి పరుగులు తీయాల్సిన దుస్థితి దాపురించింది.

మురికి కూపమా.. మున్సిపాలిటీయా

వైఎస్ఆర్‌నగర్ కాలనీ బి.బ్లాక్ మురికికూపాన్ని తలపిస్తోంది. కాలనీ ఆవిర్భావం నుంచి ఎ, బి, సి బ్లాకులు డ్రెయినేజీకి నోచుకోని పరిస్థితి కనిపిస్తోంది. అటాచ్డ్ బాత్రూమ్ వంటి సదుపాయాలు కలిగిన కుటుంబాల దగ్గర నుంచి సామాన్య కుటుంబాలల వరకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు ప్రధాన వీధుల్లో ప్రవహిస్తోంది. నిత్యం పనుల నిమిత్తం బయటికి వెళ్లే ప్రజానీకం మురుగునీటి మీ దుగా వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది.

రహదారి సదుపాయాన్ని కల్పించండి



వైఎస్ఆర్ నగర్ కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కార్పొరేషన్ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. 20 ఏళ్ల కిందట ఏర్పడిన కాలనీలో రహదారులకు నోచుకోకపోవడం అన్యాయం

- సూరి, 2వ డివిజన్, ఎ.బ్లాక్ వాసి, కడప.

డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు

డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎ.బ్లాక్ పరిధిలోని ఇళ్ల నుంచి మురుగునీరంతా రోడ్డు మీదుగా వెళ్తోంది. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

- నందం లక్ష్మీదేవి, ఎ.బ్లాక్ వాసి, 2వ డివిజన్, కడప.

తాగునీటి సదుపాయాన్ని కల్పించండి



వైఎస్ఆర్ నగర్ కాలనీలోని సి.బ్లాక్‌లో తాగునీటి సదుపాయాన్ని కల్పించండి. తాగునీటి గొట్టాలు బిగించారు.కనెక్షన్లు ఇవ్వడం మరవడంతో కాలనీలో చేరిన ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కె.ప్రసాద్, సి.బ్లాక్ వాసి, 2వ డివిజన్, కడప.

కనీస సదుపాయాలు కల్పించకపోవడం దారుణం



తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ వంటి కనీస సదుపాయాలను ఏర్పాటు చేయకపోవడం దారుణం. ప్రజాచైతన్య యాత్రలో కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరించని నేపథ్యంలో ఈ నెల ఏడున భారీ ధర్నా పిలుపునిచ్చే ఆలోచనలో ఉన్నాం.

- ఎ.రామ్మోహన్, సిపిఎం నగర కార్యదర్శి, కడప.



కారాగారంలోని రిజిస్టర్లను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఖైదీలు వైద్యుల సలహాలతో మందులు వాడాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీలు డాక్టర్ సలహాలు తీసుకుంటూ మందులు వాడాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం జడ్జి కడప పురుషుల కేంద్ర కారాగారం, మహిళల కారా గారాన్ని, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలు సుకున్నారు, ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచి ంచారు. ఖైదీలతో మాట్లాడారు. అనంతరం జైలు పరిసరాలను, టాయి లెట్లను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను సిబ్బందికి ఇచ్చారు. ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

ప్రజాశక్తి - కడప అర్బన్

డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయం విజయవాడలో పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిలను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. పార్టీ బలోపేతానికి అవసరమైన వ్యూహాలను అమలు చేయడానికి నిర్ణయాలు తీసుకున్నట్లు విజయ జ్యోతి తెలిపారు. సమావేశంలో పులివెందుల అసెంబ్లీ కో-ఆర్డినేటర్ ధ్రువ కుమార్‌రెడ్డి, జమ్మలమడుగు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ సింగం శివ మోహన్‌రెడ్డి, డెలిగేట్ డాక్టర్ అన్వర్, సయ్యద్ గౌస్ పీర్, సయ్యద్ సలాహుద్దీన్, మైనారిటీ సిటి ప్రెసిడెంట్ ముబారక్, సిద్దిక్ పాల్గొన్నారు.



పిసిసి అధ్యక్షులు షర్మిలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

డయేరియా రహిత జిల్లాగా మార్చాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాను డయేరియా రహిత, ఆరోగ్య సహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో ఈనె15 నుంచి డయేరియా (అతిసార) నియంత్రణ క్యాంపెన్‌పై కలెక్టర్ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టి విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఇన్‌ఛార్జి డిపిఒ ఖాదర్ బాషా, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎపిడమాలజిస్ట్ ఖాజా మోహిద్దీన్, ఐఎంఎ వైద్యులు, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేశ భవిష్యత్తును కృంగదీసే మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందామని ఫ్యాక్షన్‌జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం సికెదిన్నె పిఎస్ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్ డా. వి.ఎస్.ఎస్ మూర్తి, ఎన్.ఎస్.ఎస్ పి.ఓ బి. లక్షుమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్ పాఠశాల విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : గాంధీనగర్ పాఠశాల విద్యార్థులు 'సేవ్ ఎనర్జీ అండ్ సేవ్ ఎన్విరాన్మెంట్ ' ర్యాలీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు. విజేతగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంగ్లీష్ టీచర్ వి.శ్రీదేవి, కైలాస్, రమేష్, పిఇటి ప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పేదల కాలనీల్లో మౌలిక వసతుల కోసం

ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి

- కనీస సదుపాయలు కల్పించాలని, పట్టాలు ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వాలు పేదలను మోసం చేయడం తగదు
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణ పరిధిలోని మురికివాడల్లో నివాసముంటున్న తమకు తాగునీరు, ఇంటి పట్టాలు, రోడ్డు, విద్యుత్ మీటర్లు, డోర్ నెంబర్లు, పక్కా బిల్డింగులు, అంగన్వాడీ సెంటర్లు, ప్రాథమిక పాఠశాల, డ్రెయినేజీ కాలవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, శ్మశాన వాటికలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పేదలు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు ముందు పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు పేదలు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తమ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహాధర్నా చేపటాద్రు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలోని సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతిబసు కాలనీ, మార్తమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు పదివేల మందికి పైగా నిరుపేదలు కాయకష్టం చేసుకొని జీవిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అణిచివేతకు గురవుతున్న సామాజిక వర్గాలు, గ్రామీణ ధనిక పెత్తందారుల దౌర్జన్యాలు, హింసను ప్రతిఘటించలేక, పట్టణ బాటపడుతున్నారని వారన్నారు. 30 ఏళ్లలోనే బద్వేలు పట్టణం జనాభా గ్రామీణ వలసలతో తీవ్రంగా పెరిగిందన్నారు. రాజ్యాంగం, చట్టం ప్రకారం పట్టణంలోని నిరుపేదలందరికీ మంచినీరు తక్షణం అందించాలన్నారు. 2002 నుండి 2025 వరకు బద్వేల్ పట్టణంలోని సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతిబసు కాలనీ, విద్యానగర్ నుండి, మొండివాడ, జాంబవంతు నగరు, మార్తమ్మ కాలనీలో ప్రభుత్వ బంజరు భూముల్లో 25 ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకొని, రేకుల షెడ్లు నిర్మించుకొని, ఇరుకు గదుల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఇప్పటివరకు ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంతో వారికి ప్రభుత్వ పథకాలు ఏ ఒక్కటి అందడం లేదని చెప్పారు. పేదలను ప్రభుత్వాలు మోసం చేస్తూ వస్తున్నాయని తెలిపారు. పేదలు నిస్పృహకు చోటు ఇవ్వకుండా ఉమ్మడి కోరికల సాధనకు గళం విప్పాలని, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పేదలు నివసించే ప్రతి ఇంటికి క్రమబద్ధీకరణ స్కీంలో భాగంగా ఎటువంటి షరతులు లేకుండా నివాస స్థలం పట్టా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటికీ రూ. 200 కే మంచిటి కొళాయి కనెక్షన్ మంజూరు చేయాలన్నారు. పేదల నివసించే కాలనీలకు శ్మశాన వాటికకు కనీస మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె. శీను, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్ బాషా, పట్టణ కమిటీ సభ్యులు ఎం.చిన్ని , మోక్షమ్మ, షరీఫ్, అనంతమ్మ , ఖైరున్నీ, రాయప్ప , సుబ్బరాయుడు, శివ, బద్వేల్ రూరల్ కన్వీనర్ బి.వెంకటేష్, అట్లూరు మండల కన్వీనర్ ఈ.రమణయ్య, పి.రవిచంద్ర, బద్వేల్ మండల శాఖ కార్యదర్శి ఎం.ఓబులేసు, బి కోడూరు మండల కార్యదర్శి ఆర్.ఓబయ్య, పట్టణ శాఖ కార్యదర్శిలు బాలమ్మ, ప్రసాదు, కొండయ్య, ఆదిల్, మల్లికార్జున, కథానాయకుడు పొట్టి బాష, యు.రత్నమ్మ, సిద్దమ్మ, సుభాన్ బి, రామలక్ష్మమ్మ, శీను, యువరాజ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, సుధాకర్, సుధాకర్, ఫాతిమా, రమణారెడ్డి, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు, సిపిఎం నాయకులు

పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పిద్దాం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం యుటిఎఫ్ భవన్ వద్ద 'ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం' అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ బాధ్యతల నుంచి ప్రభుత్వం క్రమంగా తప్పుకుంటోందని తెలిపారు. చదువు సరుకుగా మారి లాభాలు అర్జించే సాధనమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడిలోనే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని వారన్నారు. 'బడిని కాపాడుకుందాం', 'విద్యా వికాస వేదిక', 'ఊరిబడి మన ఊరిలోనే', 'బడికోసం బస్సు యాత్ర' వంటి కార్యక్రమాలతో యుటియఫ్ ప్రజలను కూడగట్టి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునే పని చేస్తుందని తెలిపారువిద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ బడిని కాపాడుకోవడంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, టి.శివ ప్రసాద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరీ, జెవివి రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, సరస్వతి నాయకులు గోపినాథ్,రామకేశవ, ప్రకాష్ బాబు,దేవదత్తం, కె.సుధాకర్, ఎస్.దేవానందం, కె.ఈశ్వరయ్య, ఎస్.మస్తాన్ వలి, కరీముల్లా పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

7న చలో కడప కార్పొరేషన్ : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర ప్రజానికం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న చలో కడప కార్పొరేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ తెలిపారు. గురువారం నగరం లోని మృత్యుంజయకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో చలో కడప కార్పొరేషన్ పేరుతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరాన్ని అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పాలకులు చెప్పిన మాటలు సామాన్య ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగపడే స్థితిలో లేవని విమర్శించారు. అభివృద్ధి కేవలం ప్రధాన రోడ్లకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. విలీనమైన పంచాయతీల్లో అభివృద్ధి బూతద్దం పెట్టి, వెతికినా కనపడడం లేదన్నారు. నగర శివారు ప్రాంతాలు రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి సరఫరా, వీధిలైట్లు తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్ఆర్ నగర్, రామకృష్ణ నగర్, ప్రకాష్ నగర్, తిలక్‌నగర్, ఆచార్య కాలనీ తదితర ప్రాంతాల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఆందోళనలో నగర ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యుడు కుమారస్వామి రెడ్డి, కామేశ్వరమ్మ, రామకృష్ణారెడ్డి, జమీల, శివరాం, శంషాద్, గోవిందు, ఇమ్రాన్, బాల చెన్నయ్య పాల్గొన్నారు.

రక్తదానం చేయడం సంతృప్తికరం

ప్రజాశక్తి - కడప సిటీ

రక్తదానం చేయడం సంతృప్తి కలిగించిందని జిల్లా పౌరసంబంధాల శాఖ ఉద్యోగి సోహైల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిజిహెచ్‌లో ఓ గర్భిణీ రక్త కొరత కారణంగా ఇబ్బంది పడుతోందని సమాచారం అందడంతో స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేశానని తెలిపారు. రక్తం, ప్రాణం విలువ ప్రాధాన్యత తెలిపిన కారణంగానే వెంటనే స్పందించానన్నారు. 47 సార్లు రక్తదానం చేయడాన్ని ప్రస్తావన చేయడం వెనక యువతలో ఉన్న భయాన్ని పోగొట్టడమే తప్ప మరేమీ కాదన్నారు. ఆపదలో ఉన్న వారికి సహకరిచడం మానవత్వానికి నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులోనూ రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మహత్తరం రక్తదానానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

జిల్లాకు కీర్తి తెచ్చిన రచయితల సంఘం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉగాది పురస్కారాలకు వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం నుంచి ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది మన జిల్లాకు గర్వకారణమని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. గురువారం సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం చేసిన సాహిత్య కృషికి ఉగాది పురస్కారాలు లభించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సంఘం కోశాధికారి డాక్టర్ కె.రెడ్డి శేఖర్‌రెడ్డి, కార్యదర్శులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ పొదిలి నాగరాజు, సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, హరి భూషణ్ రావు, రామ్మోహన్ రెడ్డి, ముడియం కిషోర్, రామాంజనేయులు, మధు, భారవి ప్రసంగించారు.

కూటమి ఎంపీలు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కడప : లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడం రాజ్యాంగ ఉల్లంఘన అని, కూటమి ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. దేశవ్యాప్తంగా 8.75 లక్షల ఆస్తులు వక్ఫ్ బోర్డులకు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని బిజెపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే కుట్రలో భాగం గా ఈ సవరణ బిల్లు తీసుకొచ్చిందని విమర్శించారు. మన రాష్ట్రంలోని కూట మి పార్టీల ఎంపీలంతా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమని తెలిపారు.

ప్రజాక్షేత్రంలో ఓడిస్తాం : కాంగ్రెస్

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ ఆస్తుల బిల్లుకు మద్దతుగా నిలిచి, ఓట్లు వేసిన తెలుగుదేశం పార్టీ అధినేత, సిఎం చంద్రబాబును, జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ప్రజాక్షేత్రంలో ఓడిస్తామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్ హెచ్చరించారు. ఇది ఆస్తుల రక్షణ చట్టం కాదని, కేవలం వాటిని భక్షించేందుకే భారతీయ జనతా పార్టీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు కుమ్మక్కై ఈ నల్ల చట్టాన్ని తీసుకువచ్చారని విమర్శలు గుప్పించారు.

ముస్లిములను నట్టేట ముంచడం సరికాదు : సలావుద్దీన్

కడప అర్బన్ : తాము సెక్యులర్ వాదులమని చెప్పుకుంటూ ముస్లిం ఓట్లను దండుకుని అధికారంలో వచ్చి ముస్లిములను నట్టేట ముంచడం చంద్రబాబు, నితీష్ కుమార్, పవన్ కల్యాణ్‌కు తగదని, మరోసారి నయవంచన చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ముస్లిం సమాజం ఎప్పటికీ క్షమించదని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ హెచ్చరించారు.

మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప : ఈనెల 5న కడప జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ హాలులో భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) నిర్వహించబోయే జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను యువ న్యాయవాదులందరూ సద్వినియోగం చేసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి విజయ మారుతిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బసవతారకం లా కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత న్యాయవాదుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను ఒకే రోజు ఈనెల 5న నిర్వహిస్తోందని చెప్పారు. ఈనెల 16న జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు హాజరుకోబోతున్న యువ న్యాయవాదులు అందరికీ కూడా ఈ మోడల్ టెస్ట్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని వారన్నారు. కడప జిల్లా కేంద్రంలోని కడప బార్ అసోసియేషన్ హాలులో ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మోడల్ పరీక్షను నిర్వహిస్తామని వారు తెలియజేశారు. మోడల్ పేపర్‌ను ఐఎఎల్‌కు చెందిన రిటైర్డ్ జడ్జిలు, సీనియర్ న్యాయవాదులు తయారు చేశారన్నారు. అభ్యర్థులు 7013740055, 9963328876లలో సంప్రదించాలన్నారు.

వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ప్రముఖ బయోకాన్ మల్టీ నేషనల్ కంపెనీ వైవీయూలో చేపట్టిన ఎంపికలకు తిరుపతి, వైజాగ్, గుంటూరు, రాజమండ్రి, బాపట్ల, రాయచోటి, కడప జిల్లాల నుంచే కాక చత్తీష్‌ఘడ్, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ అర్హత గల అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులకు భవిష్యత్తునిస్తున్న వయోకాన్ కంపెనీని స్వాగతించారు. విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. విజయ భారతి ఎంపికల ప్రక్రియను సమన్వయం చేశారు. బయోకాన్ కంపెనీ క్వాలిటీ అస్సూరెన్స్ మేనేజర్ లక్ష్మీనరసయ్య, హెచ్.ఆర్ విభాగ డిప్యూటీ మేనేజర్ జయప్రకాష్, ఎస్సార్ డైరెక్టర్ జయభారత్, ఆపరేషన్ హెడ్ ఎన్ హెచ్ అశోక్, క్లస్టర్ హెడ్ రాజశేఖర్, హెచ్ ఆర్ విభాగ ఆర్.శరత్ విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఇందులో 160 మంది అభ్యర్థులను కంపెనీ ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, ఇంజినీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఏడాదికి రూ.3.8 లక్షల ప్యాకేజీతో వేతనాలు ఇవ్వనున్నట్టు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, అధ్యాపక, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బద్వేలు : శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేవారు. గురువారం మున్సిపల్ కమిషనర్ వాకమల నర్సింహారెడ్డి, అర్బన్ సిఐ రాజగోపాల్, ఎస్ఐ సత్యనారాయణ, టిడిపి జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరీ కనుమరుల పూటీ ప్రసాద్, ఆర్యవైశ్య వర్ధక సంఘం అధ్యక్షులు సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రం నిర్వాహకుల సేవలు అభినందనీయమని 24 గంటలు చల్లని మినరల్ వాటర్‌తో పాటు, మధ్యాహ్నం పాదచారులకు మజ్జిగ వితరణ చేయడం సంతోషకరమని తెలిపారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో ఆదర్శనీయమని అన్నారు. కీర్తిశేషులు వల్లంకొండు సుబ్బరాయుడు, నారాయణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు వల్లంకొండు వెంకటరమణ పాదచారులకు మజ్జిగ వితరణ చేశారు.

ఫారెస్ట్ క్లియరెన్స్ త్వరగా ఇవ్వండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమానికి సంబంధించి ఫారెస్ట్ క్లియరెన్స్ త్వరగా ఆమోదించాలని నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ మెంబర్ సెక్రటరీ సత్య ప్రకాష్ యాదవ్‌కు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఆ మేరకు గురువారం ఢిల్లీలో సత్య ప్రకాష్ యాదవ్‌కు కలిసి వినతిపత్రమిచ్చారు. కాశిరెడ్డి నాయన మండలం జ్యోతి క్షేత్రంలో ఉన్న శ్రీకాశి రెడ్డినాయన ఆశ్రమం అభివృద్ధి జరగాలంటే నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టాండింగ్ కమిటీ నుండి ఫారెస్ట్ క్లియరెన్స్ ఆమోదం అవసరమన్నారు. త్వరగా ఆమోదం అదేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.



వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ సుబ్బరాయుడు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి ప్రకృతి వ్యవసాయం ఎక్కువమంది చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే రోజులలో ప్రకృతి వ్యవ సాయానికి మంచి రోజులు రానున్నాయన్నారు. ఇప్పటికే ఎక్కువ మంది విని యోగదారులు రసాయన రహిత ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నార న్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలపరిధిలోని గూడెంచెరువు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం, 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు సంబంధించి ప్రవేశాల నిమిత్తం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ ప్రణీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడిబయట ఉన్న పిల్లలు, బడి మానేసిన పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్ కటుంబాలకు చెందిన బాలికలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే వారి మొబైల్‌కు సెలెక్ట్ అయిన వారికి మెసేజ్ వస్తుందన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పూర్వ పాఠశాల తరగతి వివరాలు, విద్యార్థిని పాస్‌పోర్టు సైజు ఫోటో దరఖాస్తు చేసుకొనుటకు అవసరమన్నారు. ఇప్పటి నుంచి మే 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

గాలులతో కూడిన కుండపోత వర్షం

ప్రజాశక్తి - వేముల

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉన్నట్టుండి గాలులు, ఉరుములు, మెరుపులతో అతి భారీ వర్షం పడింది. వర్షపు నీరు రోడ్లపై, పొలాలపై ఉధృతంగా ప్రవహించింది. వం కలు, వాగుల్లోకి నీరు చేరింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో ప్రయాణికులు సు మారు గంటసేపు ఇబ్బంది పడ్డారు. గత నాలుగు రోజుల నుంచి ఎండ ఎక్కువగా ఉండడం, ఉక్కపోతతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం కాస్త ఊం˘టని చ్చిందని రైతులు, స్థానికులు పేర్కొం టు న్నారు. గాలులు బలంగా వీచడంతో అక్కడక్కడ రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. అరటి చెట్లు నేలకు ఒరిగాయని రైతులు తెలిపారు.



ఈదుర గాలులతో కురుస్తున్న వర్షం

వేరుశనగ రైతులకు నష్టం

తొండూరు : మండల పరిధిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తారెత్తించింది. ఎండ వేడికి విల విల్లాడుతున్న సమయంలో వర్షం కురవడంతో జనం కాస్త ఉపశమనం పొందారు. మండల కేంద్రంతోపాటు పలు రహదారులపై నుంచి వరద నీరు ప్రవహించింది. మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. తొండూరు మండల పరిధిలోని భద్రంపల్లి, బోడివారిపల్లి, బూచుపల్లి, మల్లెల, ఊడవగండ్ల, తదితర గ్రామాల్లో 30 ఎకరాల్లో వేరుశెనగ వేసిన రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చేతికి వచ్చిన పంట వర్షానికి తడవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

డ్రైవింగ్‌తో ఉపాధి అవకాశాలు మెండు

ప్రజాశక్తి - వేంపల్లె

డ్రైవింగ్ నేర్చుకోవడం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయాని రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కాలేజీ రోడ్డులో ఉన్న దివ్వ రామంలో కవి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు బిఎన్ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్రను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా నర్సింహులు మాట్లాడుతూ బిఎన్ఆర్ డ్రైవింగ్ పాఠశాల యాజమాన్యం దాతల సహకారంతో నిరుద్యోగులకు ఉచితంగా డ్రైవింగ్ నేర్పించడం సంతోషకరమన్నారు. డ్రైవింగ్ నేర్చుకున్న వారు ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రైవింగ్ నేర్చుకున్న వారికి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యవత, యవకులు డ్రైవింగ్ నేర్చుకొని ఉద్యోగాలు పొందడం వల్ల కుటుం బాలను పోషిం చుకో వచ్చున్నారు. కార్యక్ర మంలో కవి డ్యాన్స్ అకాడమీ నిర్వహకుడు కవి ప్రసాద్‌రావు, విద్యార్థులు, బిఎన్ఆర్ డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు

పట్టని అధికారులు - ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు



ముద్దనూరు ప్రధాన రోడ్డులో పారుతున్న మురుగునీరు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై మురుగునీరు పారుతోంది. మేజర్ గ్రామ పంచాయతీలోని అమ్మవారిశాల వెనుక వీధిలో ఉన్న మురుగు కాలువలో మురుగునీరు పారేందుకు వీల్లేక నిండిపోవడంతో పొంగి పొర్లి రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసనను వెదజల్లుతోంది. వాహనదారులు, దుకాణదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగునీరు ఎగిసి మీద పడుతోందని పాదచారులు, దుకాణదారులు వాపోతున్నారు. కాలువలు శుభ్రం చేసి మురుగునీరు నిల్వ లేకుండ పారేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై నిలిచిన మురుగు నీరు తొలగించాలని దుకాణదారులు, ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం..



మురుగు కాల్వలో నీరు పారుతూ రోడ్డుపైకి వచ్చి చేరింది. మూడు రోజులుగా నిలిచిన మురుగునీటి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెదజల్లుతున్న దుర్వాసన భరించ లేకున్నాం. మురుగునీరు రోడ్డుపై దుకాణాల ముందు నిలవడంతో వ్యాపారం చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు తొలగించాలి.

- జలాలు బాషా, స్థానిక వ్యాపారి



వీధుల్లో పారుతున్న మురుగునీరు

పింఛనుదారులకు మరోమారు నోటీసులు

259 మంది విభిన్నప్రతిభావంతులకు కూడా..

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతుల (వికలాంగుల) పెన్షన్ దారులకు మరోమారు నోటీసులను అధికారులు జారీ చేశారు. మండల వ్యాప్తంగా 5,452 ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్లు ఉన్నాయి. ఇందులో వికలాంగుల పెన్షన్లు 832 ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చాలామంది వికలత్వం లేకపోయినప్పటికీ అక్రమ మార్గంలో సర్టిఫికెట్ సంపాదించి నెలకు రూ.6,000 పెన్షన్ పొందుతున్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడత ఫిబ్రవరి నెలలో పెన్షన్ దారులకు మళ్లీ వికలత్వ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఈ నెలలో మరో 259 మంది పెన్షన్‌దారులను పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పరిశీలనకు రావాలని నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ మార్గంలో సర్టిఫికెట్ సాధించి పెన్షన్ పొందుతున్న వారిలో ఆందోళన నెలకొంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జారీ..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఉన్న 259 మంది విభిన్నప్రతిభావంతుల పెన్షన్‌దారులకు నోటీసులు జారీ చేశాం. నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా పరిశీలనకు వెళ్లాలి. లేనిపక్షంలో వారి పెన్షన్ హోల్డ్‌లో పెడతాం.

-ఎంపిడిఒ కృష్ణమూర్తి

ప్రయివేట్ ఉపాధ్యాయులకు ఏడాది వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో ప్రయివేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఏడాది(12నెలల) వేతనం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్, కార్పొరేటు విద్యా సంస్థల యాజమాన్యాలు అందులో పనిచేస్తున్న అధ్యాపకులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. శ్రమకు తగ్గ వేతనం లేక ప్రయివేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సతమత మవుతున్నారన్నారు. యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఏడాది ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు మాత్రం 10 నెలల వేతనం ఇచ్చి సరిపెడులుతున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యా ర్థులకు ర్యాంకులు రావాలన్న, స్కూల్స్, కాలేజీలలో అడ్మిషన్‌లు పెరగాలన్న కీలక పాత్ర అందులో పనిచేస్తున్న సిబ్బందిదే అన్నారు. కనీస సౌకర్యాలకు నోచుకోని జీవితాలు ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులది అన్నారు. కనీసం పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలులేవన్నారు. ఉద్యోగ భద్రత లేదన్నారు. ఏళ్ల తరబడి పాఠశాల అభివృద్ధికి పనిచేస్తునా వాళ్లకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కూడా పట్టించుకున్న దాఖలాల్వేన్నారు. కూటమి ప్రభుత్వమైన ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యలు ఆల కించి, వారికి తగిన గుర్తింపునివ్వాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విచారణ పేరుతో పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు

తీరు మారకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం : వివేకా హత్య కేసులో అనుమానితుడు శ్రీనివాసులురెడ్డి భార్య పద్మావతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పోలీసులు విచారణ పేరుతో పదే పదే తమ కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనుమానితుడు కటికరెడ్డి శ్రీనివాసులురెడ్డి భార్య పద్మావతి తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. విచారణకు రమ్మని పిలుస్తున్నారని, పోలీసుల తీరు మారకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. 2019లో విచారణ పేరుతో తన భర్త శ్రీనివాసులరెడ్డిని సిఐ శ్రీరామ్ వేధిస్తున్నారని ఆత్మహత్య చేసుకుని చనిపోయాడన్నారు. పది రోజుల క్రితం ప్రొద్దుటూరు, బెంగళూరుకు వచ్చి తనను, తమ పిల్లలను విచారించారన్నారు. బంధువులైన గంగాధర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, శివరామిరెడ్డి, శివకృష్ణారెడ్డిని విచారణ పేరుతో వేధిస్తున్నారని పేర్కొన్నారు. నా చావుకు సిఐ శ్రీరామ్ వేధింపులే కారణమని తన భర్త లెటర్‌లో రాశారన్నారు. పోలీసులు మాత్రం మా బంధువులు కారణమని విచారించడం ఏమిటని పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అడిగిన వాటికి చాలాసార్లు సమాధానం చెప్పినా పదేపదే విచారణకు రమ్మని వేధిస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న పద్మావతి, బంధువులు

అంతరిస్తున్న ఆహార ధాన్యాల పంటలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కాలం గడిచే కొద్దీ ఆహార ధాన్యాల పంటలు అంతరిస్తున్నాయి. ఒకప్పుడు విరివిగా సాగు చేసిన ఆహార ధా న్యాల పంటల సాగు పట్ల రైతులు కూడా మక్కువ చూపలేకున్నారు. గతంలో పులివెందుల నియోజకవర్గ పరిధిలో 60 నుంచి 70 వేల ఎకరాల్లో కనిపించిన ఆహార ధాన్యాల పంటలు నేడు వందల ఎకరాలకు పరిమితమైందని చెప్పవచ్చు. ఇందులో ప్రధానంగా జొన్న పంట ఒకటి. రబీ సీజన్లో జొన్న పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. భారతదేశంలో ఆహారం, దాణా, పశుగ్రాసం కోసం నీటి వనరుల ఆధారంగా లేదా వర్షధారంగా జొన్న పంట సాగు చేస్తారు. భారతదేశంలో పండించే ధాన్యపు పంటల్లో జొన్న ఒకటి. జొన్న పంట దేశంలో నాలుగో స్థానంలో ఉంది. రాయలసీమ ప్రాంతంలో వ్యాపార, వాణిజ్య, కూరగాయల, ఉద్యాన పంటలతోపాటు ఆహార ధాన్యాల పంటల సాగుకు ఈ ప్రాంతం నేలలు మిక్కిలి అనుకూలిస్తాయి. చిరుధాన్యాల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘ కాలిక రోగులకు ఈ చిరుధాన్యాలు దివ్య ఔషధంలా పని చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఒకప్పుడు వీటిని రైతులు ప్రత్యేకించి పాత్రలు తయారు చేసుకుని వాటిలో దాచుకునేవారు. కరువు కాటకాలు సంభవించిన సమయాల్లో వీటిని ఉపయోగించుకోవడం వల్ల ఆహార సమస్య తలెత్తేది కాదని పలువురు రైతులు చెబుతున్నారు. గతంలో ఈ చిరుధాన్యాలు వస్తు మార్పిడి కూడా చేసుకునేవారు. ఎప్పుడైతే కిలో బియ్యం రూ.2వంటి పథకాలు అమలులోకి వచ్చాయో అప్పటి నుండి ఈ చిరుధాన్యాల పంటల సాగు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం పులివెందుల నియోజకవర్గ పరిధిలో జొన్న పంట కేవలం 20 శాతం మాత్రమే సాగు చేసినట్లు తెలుస్తోంది. ఎంతో పోషక విలువలు కలిగిన చిరు ధాన్యాలు సగటు మనిషి ఆరోగ్యం కోసం మిక్కిలి ఉపయోగపడతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని చిరుధాన్యాల పంటలు సాగు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటుసాగు చేయాలన్న ఉత్సాహం రైతులకు ఇటు సాగు చేయించాలన్న ప్రోత్సాహం అధికారులకు ఉన్నప్పుడే మళ్లీ ఈ చిరుధాన్యాల పంటలు పునర్ దర్శనమిస్తాయని మేధావులు, విశ్లేషకులు, సామాజిక వేత్తలు చెబుతున్నారు. ఆ దిశగా అంతరిస్తున్న చిరుధాన్యాల పంటను మళ్లీ వాటికి పూర్వవైభవం సంతరించుకునేందుకు కృషి చేద్దాం.



సాగులో ఉన్న జొన్నపంట

నకిలీ ఫోన్‌పే ఉపయోగించిన యువకులు అరెస్టు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులోని పెంచల నరసింహ జనరల్ స్టోర్‌లో మూడు నెలలుగా నకిలీ ఫోన్ ఫే ఉపయోగించి సరుకులు తీసుకొని దుకాణ యజమానిని బెదిరించిన ముగ్గురు యువకులను గురువారం పోలీసుల అరెస్టు చేశారు. ట్రైనీ డిఎస్‌పి భవాని చెప్పిన వివరాలు ప్రకారం.. చాపాడుకు చెందిన ఎం.శివశంకర్, సీతారాంపురం గ్రామానికి చెందిన జి.సాయి, లక్ష్మీపేటకు చెందిన వీరాంజనేయరెడ్డి మూడు నెలలుగా నకిలీ ఫోన్ పే యాప్‌ను ఉపయోగించి నగదు చెల్లిస్తున్నట్లు దుకాణ యజమానిని మోసగించారు. విషయం తెలుసుకున్న యజమాని వారిని నగదు చెల్లించాలని కోరగా కత్తితో చంపుతామని బెదిరించారు. దుకాణపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. ముగ్గురు యువకులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పెద్దయ్య, పోలీసులు పాల్గొన్నారు.



నిందితులతో ట్రైనీ డిఎస్‌పి, పోలీసులు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ ఎం.సాయిశ్రీ

అగ్నిమాపక కేంద్ర స్థల పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరులో నూతన అగ్నిమాపక శాఖ కేంద్రం ఏర్పాటు చేసేందుకు గతంలో తాడిపత్రి ప్రధాన రహదారిలోని చెన్నారెడ్డిపల్లె వద్ద ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఆ స్థలాన్ని గురువారం జమ్మలమడుగు ఆర్‌డిఒ ఎం.సాయిశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నారెడ్డిపల్లె గ్రామం వద్ద నూతన అగ్నిమాపక కేంద్రం నిర్మించేందుకు సర్వే నెం 56/3 విస్తీర్ణంలో 0.78 సెంట్లు స్థలం కేటాయించి మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి, మండల సర్వేయర్ యశోవర్ధన్ రాజు, ఆర్ఐ లక్ష్మిదేవి, విఆర్ఒ రాజశేఖర్ నాయుడు, సర్వేయర్లు రామచంద్ర, పద్మకాంత్ పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిద్దయ్య

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బలపనూరులో గురువారం ఫ్రైడే- డ్రై డే పై అవగాహన సదస్సును సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు సైఫోనోత్రిన్ పిచికారీ చేసి, ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే నిర్వహించి, ప్రజలకు దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్‌బాషా, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలపై ప్రభుత్వాలది కపట ప్రేమ

ప్రజాశక్తి - ఖాజీపేట

ముస్లింలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కడియాల మహమ్మద్ ఫయాజ్ తెలిపారు. గురువారం ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లు ముస్లిం సమాజ ఎదుగుదలకు, వారి జీవితాలను బాగుపరచడం కోసం అని చెప్పడం వింతగా ఉందన్నారు. తనకి మైనారిటీ వర్గాల ప్రజలంటే ఎంతో గౌరవం అనడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు తమ పార్టీ ఎంపీలు మద్దతు తెలపడం చూస్తే అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రులు అందరికీ మైనారిటీలకు వ్యతిరేకంగా మాట్లాడడం అలవాటైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశంలోని అన్ని మతాల వారికి సమానమైన గౌరవాన్ని కల్పించిందన్నారు. భారతదేశాన్ని పెద్ద సెక్యులర్ దేశంగా ప్రపంచానికి తెలియజేసిందన్నారు.

క్లీన్ ఎయిర్ సిటీగా కడప హర్షణీయం

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గాలి నాణ్యత నివేదికలో 42 పాయింట్లతో కడప నగరం రాష్ట్రంలోనే అత్యంత క్లీన్ ఎయిర్ సిటీగా ఎంపిక కావడం హర్షణీయం, అభినందనీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్లీన్ ఎయిర్ సిటిగా 52 పాయింట్లతో నెల్లూరు రెండవ స్థానంలో ఉండగా 56 పాయింట్లతో కర్నూల్, ఒంగోలు 3వ స్థానంలో ఉన్నాయన్నారు. 120 పాయింట్లతో విశాఖ అట్టడుగున ఉండడం గమనార్హమన్నారు. కడప మెప్మాకు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కడం సంతోషకరమన్నారు.

మెడికల్ స్టోర్ సుబ్రమణ్యం మృతికి నివాళి : వేంపల్లెలో ధనలక్ష్మి మెడికల్ స్టోర్స్ యాజమాని సుబ్రమణ్యం మృతి చెందడంతో ఆయన భౌతికాయాన్ని తులసిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, సుబ్రమణ్యం, అమర్నాథ్ రెడ్డి, నాగరాజు, వినయ్, రమణ ఉన్నారు.



పార్కులో జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరద

ఓపెన్ జిమ్ ఆరోగ్యకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వాకింగ్‌కు వచ్చే వారికి ఓపెన్ జిమ్ ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గోపవరం పంచాయితీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో గురువారం ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, యువ నాయకుడు బచ్చల వీరప్రతాప్, స్థానిక నాయకులు పొట్టు లక్ష్మిరెడ్డి, లక్ష్మణ్, ఈశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి, జయరామిరెడ్డి, సునీల్, కొండయ్య, వెంకటరాముడు, నాయకులు, ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులివెందులలో 30 యాక్ట్ అమలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆదేశాల మేరకు పట్టణంలో 30 యాక్ట్ అమలులో ఉందని పట్టణ ఎస్ఐ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల పట్టణం, దాని చుట్టుపక్కల ఎలాంటి అధి కారిక ఉత్తర్వులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. దీన్ని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా జెడి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దేశం గర్వించదగ్గ మేధావి జెడి లక్ష్మీనారాయణ అని రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షులు ఎస్‌వి భార్గవ్‌సాయి అన్నారు. గురువారం స్థానిక గాంధీరోడ్డులోని కృష్ణగోపి కోచింగ్ సెంటర్లో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, జెడి ఫౌండేషన్ అధినేత జెడి లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు కందుల సాయి, నిఖిల్, పవన్‌కుమార్, నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 4 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య



ప్రాంగణ ఎంపికల్లో 29 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో మద్రాసుకు చెందిన ఎఆర్‌కె హెచ్‌ఆర్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది విద్యార్థులు ఉపాధి పొందాలని సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సి.విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సిఎంఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వివిధ దశలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 29 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ మేనేజర్ కుసుమ, సురేష్ కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు లక్షల వార్షిక వేతనం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిఎన్‌ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డితో పాటు ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను అభినందించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

గాలివాన బీభత్సం

- అరటి, మామిడి తోటలకు నష్టం
- నేలకొరిగిన భారీ వృక్షాలు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం ప్రజలను భయాందోళనకు గురిచేసింది. గాలివాన బీభత్సానికి ప్రధాన రహదారిపై, గ్రామాలలో భారీ వృక్షాల కొమ్మలు నెలకొరిగాయి. అరటి చెట్లు నేలకొరిగాయి. అరటి గెలలు దెబ్బతిన్నాయి. మామిడికాయలు నేలరాలాయి. రైల్వేకోడూరు ప్రాంతంలో రైతులు అధికంగా అరటి, బొప్పాయి, మామిడి పంటలు సాగు చేస్తుంటారు వేసవికాలంలో పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో పంట నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి తోటల్లో రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పురుగు మందులు స్ప్రే చేశారు. ప్రస్తుతం మామిడి పిందే దశలోనే ఉంది. అరటి గెలలు కోతకొచ్చాయి. ఇలాంటి సమయంలో గాలివాన బీభత్సం సృష్టించడంతో పంటలు నేలరాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టం వివరాలు ఉద్యాన శాఖ అధికారులు అంచనాలు వేయాల్సి ఉంది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షంతో ఉపశమనం

జిల్లాలో కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. అత్యధిక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 38 నుంచి 40 డిగ్రీలు నమోదయ్యాయి. వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం కొన్నిచోట్ల జల్లులు పడ్డాయి. తిరిగి గురువారం మధ్యాహ్నం వాతావరణం మారింది. పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండుతున్న ఎండలతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి ఉపశమనం లభించింది. గాలివానతో ఒకవైపు ఖేదం, మరోవైపు మోదంలా మారింది.


గాలివాన బీభత్సానికి నేలకొరిగిన అరటి పంట

పిడుగుపాటుకు మూడు ఆవులు మృతి

బి.కొత్తకోట: పిడుగు పడి మూడు పాడియావులు మృత్యువాత పడ్డ విషాదకర సంఘటన పెద్దమండెం మండలంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబీకులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండెం మండలం, చెరువుకిందపల్లిలో గురువారం సాయంత్రం పిడుగు పడి రైతు జి.నాగరాజుకు చెందిన మూడు పాడి ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన వచ్చి పిడుగు పడింది పాడియావులు మృతి చెందడంతో రైతు కన్నీటిపర్యంతమయ్యారు. ఆదుకోవాలని కోరారు.


నేలకొరిగిన వృక్షాలను తొలగిస్తున్న ప్రజలు


బి.కొత్తకోట : పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులు

7న 'చలో తిరుపతి'ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న తిరుపతి నగరంలోని ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఆవరణంలో చలో తిరుపతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, 2022 ఎఆర్‌సి ప్రకారం రావాల్సిన అరియర్స్ ఇంతవరకు చెల్లించలేదని వాటిని త్వరగా చెల్లించాలని, డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఒకే విధంగా జీతభత్యాలు చెల్లించాలని, సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌ను నియమించాలని, తదితర న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించే ధర్నా కార్యక్రమంలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్కం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, యుఇఐయు జిల్లా నాయకులు రెడ్డప్ప, ఖాదర్ బాషా, డివిజన్ నాయకులు డి.వి. రమణ, వీరారెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నాగేశ్ గౌడ్, డివిజన్ నాయకులు గజ నాయుడు, రామాంజులు, శ్రీధర్, మల్లిరెడ్డి, రామాంజులురెడ్డి, విశ్వనాధ్, ప్రతాప్, సునీల్, జగదీశ్, కార్మికులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

ఈనెల 5న కడప జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ హాలులో భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) నిర్వహించబోయే జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను యువ న్యాయవాదులందరూ సద్వినియోగం చేసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనందకుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన ఇలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత న్యాయవాదుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను ఒకే రోజు ఈనెల 5న నిర్వహిస్తోందని చెప్పారు. ఈ నెల 16న జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు హాజరుకోబోతున్న యువ న్యాయవాదులు అందరికీ కూడా ఈ మోడల్ టెస్ట్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని వారన్నారు. కడప జిల్లా కేంద్రంలోని కడప బార్ అసోసియేషన్ హాలులో ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మోడల్ పరీక్షను నిర్వహిస్తామని వారు తెలియజేశారు. మోడల్ పేపర్‌ను ఐఎఎల్‌కు చెందిన రిటైర్డ్ జడ్జిలు, సీనియర్ న్యాయవాదులు తయారు చేశారని పేర్కొన్నారు. అభ్యర్థులు 7013740055, 9963328876లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఎల్ జిల్లా కమిటీ నాయకులు చిన్నయ్య, హమయున్ బాష, ఎం.రవిశంకర్, డి.నాగముని, వి.సిద్దయ్య పాల్గొన్నారు.

కనులపండువగా పట్టాభిరాముడి ధ్వజారోహణం

- గజవాహనంపై ప్రతాపరాముడు విహారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిక్షేత్రం శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణంతో శ్రీవిశ్వావసు నామ సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి టిటిడి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుడ పటాన్ని ఎగురవేశారు. నాగదోషం, సంతాన ప్రాప్తి కోసం మహిళలకు కొడి ప్రసాదం పంపిణీ చేశారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, అలంకరణ, తోమాలసేవ, యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరామస్వామి ఉత్సవ మూర్తులకు ఉయ్యాల మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ధ్వజారోహణంతో సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారి కృష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

గజవాహనంపై ఊరేగిన ప్రతాపరాముడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు శ్రీ పట్టాభిరాముడు రాత్రి 8గంటల నుండి 10 గంటల వరకు గజవాహనంపై తిరుమాఢ వీధుల్లో విహరించారు. వాహనం ఎదుట మహిళలు పిండిదీపాలతో స్వాగతం పలికారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ పట్టాభిరాముడు గజవాహనంపై విహరించగా.. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొడుతూ, కర్పూర హారతులతో స్వామిని సేవించుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు ముత్యపుపందిరి వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి హనుమంత వాహనంపై విహరిస్తారు.


ధ్వజారోహణం గావిస్తున్న వేదపండితులు

ఆటోనగర్ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రామీణ మండలం, వలసపల్లి పంచాయతీలో గత 15 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఆటోనగర్ ప్రాంతాన్ని గురువారం ఎమ్మెల్యే షాజహాన్ భాష ఏపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తితో కలిసి పరిశీలించారు. గత 15 ఏళ్ల క్రితం ఆటోనగర్ కు రైతులు తమ భూములు ఇచ్చారు. అయితే వారికి నష్టపరిహారం అందక పోవడంతో కోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఈ కారణంగా ఆటోనగర్ ని అభివ ృద్ధి చేయలేకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. వీలైనంత త్వరలో ఆటోనగర్ కోర్టు విషయాలను పరిష్కరించి, సంబంధిత రైతులతో ఒప్పించి ఆటోనగర్ ప్రాంతంలో నెలకొన్న ఇబ్బందులను తొలగించి, అభివ ృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రమణయ్య నాయుడు, సీతక్క యుగంధర్, గురు మంచూరు, సురేందర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులు, రైతులతో కలిసి ఆటోనగర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

ప్రజాశక్తి-పుల్లంపేట : పుల్లంపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డుపైకి దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసు కోవాలని సూచించారు. రోడ్లపై చెత్తా చెదారాన్ని వేయవద్దని తెలిపారు. ఎవరైనా చట్టాలను అతిక్రమించి రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసు కోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం జోహార్‌బాషా

ఎస్‌హెచ్‌జిలను విస్తృతపరచడమే ధ్యేయం : ఎపిఎం

ప్రజాశక్తి-పీలేరు: స్వయం సహాయక సంఘాల్లో(ఎస్‌హెచ్‌జి) సభ్యుల జీవనోపాధులు విస్తృతపరచడమే లక్ష్యమని ఎపిఎం జోహార్ బాష తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘం, సంఘ సభ్యుల జీవనోపాధుల ఏర్పాటు, కుటుంబ అవసరాల కోసం అవసరమైన రుణ ప్రణాళికల తయారీకి విఒఎలు, ఎన్యుమరేటర్లకు గురువారం వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనోపాధుల కార్యక్రమాలను మరింత విస్తృత పరచడానికి పొదుపులు, అప్పులను సమర్థవంతంగా వినియోగించడంలో ఎస్‌హెచ్‌జి మహిళా సభ్యుల సామర్థ్యాలను పెంచడానికి తోడ్పడుతుందన్నారు. సభ్యుల వారీగా వాస్తవిక అంచనాల ఆధారంగా వార్షిక రుణ ప్రణాళిక తయారు చేయడం పై శిక్షణా కార్యక్రమం నిర్వహించ పడిందని తెలియజేశారు. సంఘంలో సభ్యులవారీ వాస్తవిక అంచనాల ఆధారంగా ప్రణాళికలను తయారు చేసి, గత 25 సంవత్స రాలుగా సంఘాల్లోని మహిళలు వివిధ బ్యాంకుల నుండి బ్యాంకు లింకేజి, మండల సమాఖ్య, గ్రామ సంఘాలు, స్త్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ రుణాలు పొంది, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా బలోపేతమౌతూ, సుస్థిర అభివృద్ధికి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సంఘ సభ్యులకు అవసరమైన సమయంలో వారి జీవనోపాధులు ఏర్పాటుకు, కుటుంబ అవసరాలకు కావలసిన పెట్టుబడిని రుణం జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడానికి మొబైల్ యాప్ ఇవ్వడం జరిగిందని, ఈ యాప్‌లో ప్రస్తుతం ప్రతి సభ్యురాలికి తాను తీసుకున్న అప్పులో ప్రస్తుతమున్న నిల్వ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో తనకు, తన కుటుంబ సభ్యుల జీవనోపాధుల ఏర్పాటుకు, కుటుంబ అవసరాలకు కావలసిన పెట్టుబడికి రుణ వివరాలు నమోదు చేయుట ద్వారా, రుణ అవసరాల అంచనా ప్రణాళిక తయారు చేయుట, తద్వారా ఆ ప్రణాళిక ప్రకారం ఆయా సమయంలో వారికి రుణ మంజూరు చేయుట ద్వారా సభ్యుల అవసరాలకు పెట్టుబడిని అందించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిధిలోని విఒఎలు, ఎన్యుమరేటర్లతో పాటు డిఎంజి మధుబాబు, సిసిలు చంద్రకళ, మాసయ్య, అహ్మద్ బాష, మంజుల, కవిత పాల్గొన్నారు.

సాధారణ ప్రసవంపై గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు సాధారణ ప్రసవంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రసవం సమయంలో తల్లికి, శిశువుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు నొప్పిని తట్టుకోవడానికి ఉపయోగపడే పద్ధతుల గురించి, ప్రసవం సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ఆరిఫుల్లా, గైనకాలజిస్ట్ డాక్టర్ హసీనా ఫర్వీన్, సామాజిక ఆసుపత్రి సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.


బహుమతిని స్వీకరిస్తున్న విద్యార్థి బాలాజీ

హ్యాక్ ఫెస్టాలో 'మిట్స్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సి.బాలాజీ పుత్తూరు సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి హ్యాక్ ఫెస్టా 2కె25 పోటీలలో ప్రతిభ కనపరచి రెండవ బహుమతిగా రూ.15 వేలు నగదు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో విద్యార్థులు, స్టార్టప్‌లు, టెక్నాలజీకి సంబంధిచిన తమ సృజనాత్మకతను, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశాన్ని పొందారన్నారు. ముఖ్యంగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై చర్చలు, ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ టెక్నాలజీ నిపుణులు, పరిశ్రమ నాయకులు, శాస్త్రవేత్తలు హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డేటా సైన్సు విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.భాస్కర్ సహాయ సహకారంతో ప్రతిభ కనపరిచిన బాలాజీని విభాగాధిపతి డాక్టర్ కుసుమ, కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, తదితరులు అభినందనలు తెలియజేసారు.

కబ్జాదారుల చేతుల్లో ఎస్సీ, ఎస్టీ భూములు

ప్రజాశక్తి-పీలేరు : మండలంలో కబ్జాదారుల చేతుల్లోని ఎస్సీ, ఎస్టీల భూములకు రక్షణ ల్పించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ తెలిపారు. గురువారం పీలేరు మాలమహానాడు కార్యాలయంలో మండల యూత్ ప్రెసిడెంట్ జెట్టి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో హీనజాతులకు ప్రభుత్వం భూమి కేటాయించిందని, అగ్రకుల పెత్తందారులు కొందరు ఆ భూమిని కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా హక్కుదారులైన దళితులకు ఆ భూమి అప్పగించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాలమహానాడు కార్యవర్గ సభ్యులు వెంకటేష్, గంగారపు గంగయ్య పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గాజుల భాస్కర్, నాయకులు

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కితీసుకోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు నాయబ్ సయ్యద్ అలీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బాబా సర్దార్ పార్టీ శ్రేణులతో కలిసి గురువారం డిసిసి కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఒక గంట శాంతి యుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ప్రజల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయన్నారు. వక్ఫ్‌సవరణ బిల్లు వల్ల మస్జీద్, మదరస, ఖబరస్తాన్‌లకు, ముస్లిం సమాజం మతపరమైన స్వేచ్ఛకు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశ పెట్టిందని చెప్పారు, ముస్లిం సామాజిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని, బిల్లును వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ తరుపున న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అలీ, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్ ఖాన్, మాజీ పట్టణ అధ్యక్షులు ఖాదర్ ఖాన్, ఇమ్రాన్, రియాజ్, అమీర్, జాబీర్, షేక్ అమీర్, కరీముల్లా పాల్గొన్నారు.

మైనార్టీలకు ద్రోహం చేసిన కూటమి ప్రభుత్వం : వైసిపి

మైనారిటీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా ద్రోహం చేసిందని వైసిపి మైనారిటీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. గురువారం తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధం లేని ప్రయివేటు ఆస్తులు తమ పూర్వీకులు అల్లా పేరుతో వక్ఫ్‌కు దానం చేస్తే ఆ ఆస్తులను తమ గుప్పిట్లోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డులో ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు ముస్లింలు లేరన్నారు. ముస్లింలకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేనలు నేడు వారి ఆశలపై నీళ్ళు జల్లారని ఆరోపించారు. 2024 వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ముస్లింలు అభద్రతాభావానికి లోనవుతున్నారన్న కారణంతో వైసిపి పూర్తిస్థాయిలో వ్యతిరేకించిందని గుర్తు చేశారు.

ముస్లిం మైనార్టీలను బలహీన పరచడమే బిజెపి లక్ష్యం

మదనపల్లె అర్బన్ : భారతదేశంలో ముస్లిం మైనార్టీలను బలహీన పరచడమే బిజెపి లక్ష్యమని, అందులో భాగమే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చారని మదనపల్లె వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ఆరోపించారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ మనోభావాలను దెబ్బతీసే విధంగా, వారి ఆస్తులపై వారికి ఎలాంటి హక్కు లేకుండా చేసి కొల్లగొట్టడానికి ఈ వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. ఈ దేశం ముస్లిం మైనార్టీలకు హక్కేగానీ, ఛాయిస్ కాదనే విషయాన్ని బిజెపి ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముస్లింల ద్రోహిగా మిగిలిపోతారని, ఇంకెప్పుడూ ముస్లింలు వారిని క్షమించరని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎండిసి మాజీ చైర్‌పర్సన్ షమీమ్ అస్లామ్, ఖాజా, షబానా, ముబీన, రఫి, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎస్ఎ కరీముల్లా పాల్గొన్నారు.

ముస్లింలకు మేలు చేసేదే వక్ఫ్ సవరణ చట్టం : టిడిపి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం-2024 ముస్లింలకు మేలు చేసేదేనని, ముస్లిం మైనార్టీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వక్ఫ్ సవరణ చట్టం-2024పై కొన్ని సూచనలు, సలహాలు ఇవ్వగా వాటిని కేంద్ర ప్రభుత్వం స్వీకరించి చట్టంలో మార్పులు చేర్పులు చేసిందన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై మాట్లాడే నైతికహక్కు మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డికి, వైసిపి నాయకులకు లేదని విమర్శించారు. కార్యక్రమంలో యువనాయకుడు జునైద్ అక్బరీ, ఆర్.జె.వెంకటేష్, ఎస్.ఎ.మస్తాన్, నవీన్ చౌదరి, బాలు స్వామి, షంషీర్, సర్పంచ్ మధు, తలారి రాధమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు



విజయలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి

యువత స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలని జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కళాశాలలో ఫుడ్ టెక్నాలజీ, ఆరన్ సైంటిఫిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మష్రూమ్ కల్టివేషన్ వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.విజయలక్ష్మి, ఆరన్ సైంటిఫిక్ ఫౌండర్ డాక్టర్ ఎన్.నందకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించామని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో శాస్త్రీయ విజ్ఞానం, అనుసంధానించడం ఎంత అవసరమో, ఈ తరహా శిక్షణ ద్వారా అర్థమవుతుందని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ త్యాగరాజన్ మాట్లాడుతూ పుట్టగొడుగులు పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి లాభాలను పొందవచ్చునని విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా తగిన నైపుణ్యాలు నేర్చుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని కళాశాల తరపున ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరింత ప్రోత్సహించేందుకు మేము కట్టుబడి ఉన్నామని అన్నారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.విజయలక్ష్మి మాట్లాడుతూ పుట్టగొడుగులు పోషకాహార విలువలతో నిండి ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. సరైన విధానంలో పెంచితే, తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు కీర్తి, ఎం.అఖిల, ఎం.మౌనిక, ఆర్.భాగ్యశ్రీ, డాక్టర్ ప్రమోద్ వినయ్‌కుమార్, ఎ.షీబారాణి, బోధనేతర సిబ్బంది ప్రసాద్, దీప, శ్రీలత పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగలులను ఎదిరించి మరాఠా సామ్రాజ్య స్థాపన చేసిన వీరుడు శివాజీ అని, ఒక రాజుగా ప్రజా సంక్షేమం కోసం కృషి చేసి ఛత్రపతిగా పేరొందారని అన్నారు. తల్లి జిజియాబాయి చెప్పినమాటలు ఆయనను ఎంతో ప్రభావితం చేశాయని అందువల్లే అంత గొప్ప మహారాజుగా తీర్చి దిద్దాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పక్కీరారెడ్డిగారిపల్లెలో ఏర్పాటు చేస్తున్న సిమెంటు రోడ్డు

పక్కీరారెడ్డిగారిపల్లిలో సిసిరోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ పక్కీరారెడ్డిగారిపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ఎట్టకేలకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయం, తపాలా కార్యాలయం, స్టేట్ బ్యాంకుకు వెళ్లాలంటే ఈ రోడ్డు ద్వారానే వెళ్ళాలి. గతంలో ఈరోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు పడేవారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో స్థానిక టిడిపి మండల నాయకుడు కొండ్రెడ్డి. శ్రీకాంత్ రెడ్డి చొరవతో సిసి రోడ్డు నిర్మాణానికి నాంది పలికించారు. శుక్రవారంతో ప్రధాన రహదారి నుండి పక్కీరా రెడ్డిగారిపల్లి వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు పిఆర్‌జెఇ రాజశేఖర్ పేర్కొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

-పాల్గొన్న టిడిపి జిల్లా అధ్యక్షులు 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేటఅర్బన్



గంగమ్మ జాతరలో జగన్‌మోహన్‌రాజు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మ జాతర గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగిందని నిర్వాహకులు తెలిపారు. జాతరలో భాగంగా బుధవారం రాత్రి తుమ్మల అగ్రహారం కు చెందిన మహిళలు సంప్రదాయ బద్దంగా గడ్డ దీయలను తీసుకురాగా, నారపు రెడ్డి పల్లె గ్రామస్తులు పోతులు రాజును, నవధాన్యాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది జాతరలో పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎఎస్‌పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే ఆధ్వర్యంలో రాజంపేట పోలీస్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళ పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సిసి కెమెరాల నిఘాతో శాంతిభద్రతలను పర్యవేక్షించారు. నారపురెడ్డిపల్లి, గంగిరెడ్డి పాలెం, నూనెవారిపల్లె ప్రాంతాలలో వాహనాల పార్కింగ్ కు అనుమతించడంతో జాతరలో ట్రాఫిక్ బెడద లేకుండా నిలువరించారు. గురువారం టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు టిడిపి నాయకులతో కలిసి జాతరలో పాల్గొన్నారు.

ప్రకటన

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణము నందు వెలసిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం నందు శ్రీయుత కమీషనర్. దేవాదాయశాఖ గొల్లపూడి వారి ఉత్తర్వులు L.Dis.No.C1/13024 (40)/9/2024, Dt:01.03.2025 జూనియర్ అసిస్టెంటు పోస్టు (2) లకు విద్యార్హతలు ఏదైనా డిగ్రీ సర్టిఫికేట్ ఉండవలెను నెల ఒక్కింటికి Rs.18500/-, L.Dis. No.C1/13024(40)/ 13/2024, Dt:26.02.2025 రికార్డు అసిస్టెంటు పోస్టు (1) ఇంటర్ మీడియట్ సర్టిఫికేట్ ఉండవలెను నెలకు జీతం నెలకు రూ.15000/-లతో ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏదైనా ఏజెన్సీల ద్వారా నియామకానికి ఈ క్రింద తెలిపిన అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. అభ్యర్థులు హిందూ మతం కలవారై వుండవలెను. వయస్సు 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాలలోపు వుండవలెను. పై వివరములతో తెలిపిన దరఖాస్తులకు వారి అర్హత సర్టిఫికెట్లతో ఈ ప్రకటన వెలువడిన 7రోజుల లోపల కార్యనిర్వహణాధికారి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం, రాయ చోటి వారి పేరుమీద పంపవలెను.

కార్యనిర్వహణాధికారి,
శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, రాయచోటి

పడకేసిన పారిశుధ్యం

- చెత్త తరలింపునకు సిబ్బంది ఉన్నా.. సరిపడ లేని ట్రాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ట్రాలీలు లేక నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్లు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీగా ఉన్న బి.కొత్తకోట పట్టణంలో జన సాంద్రత పెరుగుతోంది. జనాభా పెరుగుదల రీత్యా పట్టణంలో రోజురోజు చెత్తా చెదారం పెరుగుతోంది. రోడ్లపై ఎక్కడ చూసి డస్ట్‌బిన్ చెత్త వ్యర్థాలతో నిండిపోతున్నాయి. రోడ్లపై చెత్త దిబ్బలు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. చెత్తను తరలించేందుకు పారిశుధ్య కార్మికులు ఉన్నా అందుకు సరిపడ వాహనాలు లేకపోవడంతో పారిశుధ్య సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎంపీ నిధులతో పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మూడు ట్రాక్టర్లను నగర పంచాయతీ శుభ్రత కొరకు మంజూరు చేశారు. ఈ టాక్టర్లతోపాటు గతంలో ఉన్న నాలుగు టాక్టర్లు ఉండగా రెండు ట్రాక్టర్లు మరమ్మతులతో పక్కకు పెట్టారు. రెండు టాక్టర్లకు ట్రాలీలు లేకపోవడంతో ఉపయోగించలేదని అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి తెలిపారు. రోడ్లపై ఉన్న చెత్త, వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పోతున్నామని ప్రజలు చెబుతున్నారు. దోమలు విజృంభిస్తుం డటంతో విష జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి చెత్తతరలింపునకు ట్రాలీలు తెప్పించి స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంపీ నిధులతో మంజూరైన ట్రాక్టర్లు

కేన్సర్‌పై అవగాహన అవసరం



కేన్సర్, వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

కేన్సర్, వడదెబ్బపై ప్రజలకు అవగాహన అవసరమని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప, ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ పేర్కొన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు కలికిరి మండలం మేడికుర్తి పిహెచ్‌సి పరిధిలోని గుండ్లురులో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా హాజరైన ప్రజలకు వడదెబ్బ, కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 14 నుంచి ఇంటింటి కేన్సర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 35శాతం సర్వే 18సంవత్సరాల పైబడిన వారికి నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్‌పై సర్వే స్క్రీనింగ్ పూర్తి అయ్యిందని తెలిపారు. కేన్సర్ పరీక్షలో భాగంగా ప్రతీ ఇంటిని ఆశా కార్యకర్త, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు సందర్శించి డేటా సేకరించి స్క్రీనింగ్ చేస్తున్నారని అన్నారు. అనుమానిత కేసులను వైద్యులు చూసి పరీక్షలు చేసిన తరువాత వారికి రెఫెర్ చేయవలసి వస్తే ఆశా కార్యకర్తలు ద్వారా జిల్లా అస్పత్రికి పంపించి తదుపరి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి ఒకవేళ నిర్ధారణ ఐతే వీలైనంత త్వరగా చికిత్స ప్రారంభిస్తారని చెప్పారు. ఎండలు క్రమేపి ఎక్కువ అవుచున్న దరిమిలా ఇప్పటికే వాతావరణశాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖలు హెచ్చరికలు జారీచేసాయి కావున ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎక్కువగా ఎండ కు గురి కావడం వల్ల మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రణ చేసే కేంద్రం దెబ్బతిని వడ దెబ్బ కు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. గర్భిణులు, బాలింతలు, పదేళ్ల లోపు పిల్లలు, 60సంవత్సరాల పైబడిన వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పొలం పనులు చేయు కూలీలు, రైతులు ఉదయం ఆరు గంటలనుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి పనులు చేసుకోవాలని చెప్పారు. మంచినీరు తరచుగా తాగాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మాంసాహారం, ఉప్పు, కారం, మసాలాలు తగ్గించి తినాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు సిద్దమ్మ, ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పిలు నాగవేణి, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీస్ మౌనిక, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

మూడు నెలలుగా ఎటిఎం మూత

-ఇబ్బందుల్లో ఖాతాదారులు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని ఎస్‌బిఐ ఎటిఎం గత మూడు నెలలుగా సాంకేతిక సమస్యతో మూతపడింది. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు నగదు లావాదేవీలను ఎక్కువుగా ఎటిఎం ద్వారా చేస్తుంటారు. మూడు నెలలుగా ఎటిఎం పనిచేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు వాపోతున్నారు. సుమారు 30 వేలకు పైగా ఖాతాదారులు ఉన్న ఎస్‌బిఐలో అత్యవసర పరిస్థితుల్లో నగదు విషయంలో చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మిగతా బ్రాంచ్ లకు సంబంధించి ఒకటి రెండు ఎటిఎంలు ఉన్నప్పటికీ ఆ బ్యాంకుల్లో నగదును విత్‌డ్రా చేసుకుంటే సర్‌చార్జీలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు తరబడి పనిచేయకపోవడం తీవ్ర ఇబ్బంగుందని పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్ పుష్పలతను వివరణ అడగగా సాంకేతిక సమస్యతో ఎటిఎం లాక్ అయిందని, ఇప్పటికే ఫిర్యాదు చేశామని చెప్పారు. ముంబయి నుంచి అదే స్థానంలో మరో ఎటిఎం అమర్చుతారని తెలిపారు. ఏదిఏమైనా ఖాతాదారుల ఇబ్బందులను గుర్తించి ఖాతాదారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మూతపడిన ఎస్‌బిఐ ఎటిఎం

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపిడిఒ



మాట్లాడుతున్న ఎఇ నాగరాజు నాయక్

ప్రజాశక్తి-కలకడ

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు , సచివాలయం సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నీటి ఎద్దడి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది అన్నారు. ఇందుకోసం ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ సచివాలయాల పరిధిలో నీటి సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో నీటి సమస్యలు మరింత ఎక్కువైతే బోర్లు అవసరమైతే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగరాజు నాయక్ సూచించారు.గ్రామాలలో వచ్చే వేసవి తాకిడిని తట్టుకునేలా నీటి ఎద్దడి నివారణకు తమ వంతు కృషి చేసి నీటి సమస్యలు లేకుండా చేయడం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం రెవెన్యూ సిబ్బంది కూడా తమకు సహకరించాలని సూచించినట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో నీటి సమస్యలు ఉన్నట్లు స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు తెలుపగా ఎందుకు స్పందించిన ఎంపిడిఒ నూతన బోరు ఏర్పాటుకు కలెక్టర్ ప్రతిపాదనలు పంపి బోరు వేసేందుకు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగమునినాయక్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నితిన్‌గడ్కరికి వినతి పత్రం అందిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

కేంద్ర మంత్రిని కలిసిన 'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

కడప-రేణిగుంట హైవే నిర్మాణ పనులపై కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి గురువారం కేంద్ర రోడ్లు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఐదేళ్లుగా నత్తనడకన నడుస్తున్న కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రూపానందరెడ్డి అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన గడ్కరి అప్పటికప్పుడు రోడ్డు నిర్మాణానికి గాను రూ.85 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు రూపానంద రెడ్డి తెలిపారు. ఈ మేరకు మే తొలి వారంలో టెండర్లు పిలుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కడప-రేణిగుంట హైవేను ఆరులైన్ల రహదారిగా నిర్మించాలన్న తన అభ్యర్థనకు గడ్కరి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఆరులైన్ల రహదారిని అభివృద్ధి చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. హైవే నిర్మాణ పనులను సర్వేకంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని అన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్థిక ఇబ్బందులతో మదనపల్లె పట్టణానికి చెందిన రాజంపేట పార్లమెంట్ ఐటిడిపి కమిటీ ఉపాధ్యక్షులు వేల్పుల వెంకటేష్ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న మదనపల్లె నియోజకవర్గం టిడిపి నాయకులు లోకేష్ కొణిదెల ఆసుపత్రికి చేరుకొని ఐసీయూలో చికిత్స పొందుతున్న వెంకటేష్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరాతీశారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వెంకటేష్ తండ్రి, భార్య రాజేశ్వరి లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. తక్షణ సాయంగా రూ.లక్ష ఆర్థిసాయం అందించారు. ఈ సందర్భంగా లోకేష్ కొణిదెల మాట్లాడుతూ పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని, ఏ సమస్య వచ్చినా ఆదుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. వేల్పుల వెంకటేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లోకేష్ కొణిదెల వెంట నాయకులు నవీన్ పెరవలి, రాజేష్ రాటకొండ, నిరంజన్ నాని, సిరివేలు చరణ్ కుమార్, డాక్టర్ మర్రిపాటి రమేష్, వంశీ శ్రీనరసింహా, గగన్, సాయి మహేష్, జస్వంత్ చౌదరి, ప్రభాకర్, కాశీ, శ్రీరామ్‌మాల్మీకి, ప్రకాష్ నాయుడు ఉన్నారు.



వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న లోకేష్



అవిశ్వాసన తీర్మానంపై ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న ఎంపిటిసిలు

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- సమావేశాన్ని బహిష్కరించిన ఎంపిటిసిలు
- ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. గురువారం మండల సర్వసభ సమావేశాన్ని ఎంపిడిఒ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎంపిపి లక్ష్మీ నరసమ్మ మాట్లాడుతారని తెలిపారు. ఎంపిపి మాట్లాడుతున్న సమయంలో పది మంది ఎంపిటిసిలు సమావేశాన్ని బహిష్కరించి, ఎంపిపిపై అవిశ్వాసతీర్మానం పెడుతూ ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. గతంలో రెండుసార్లు జరగవలసిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిటిసిల కోరం లేనందువల్ల రద్దుపరిచిన విషయం విధితమే. అప్పటి నుంచి ఇది మూడో మండల సర్వసభ సమావేశం. ఈ సమావేశాన్ని కూడా ఎంపిటిసిలు బహిష్కరించి ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ తాను ఎస్‌సి మహిళ అయినందువల్ల ఎంపిటిసిలు తనపై అవిశ్వాస తీర్మానం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఎంపిటిసిలు మాట్లాడుతూ ఎస్‌సి మహిళా అయినందువల్ల తాము సమావేశాన్ని బహిష్కరించలేదని చేయలేదని, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నాయకత్వంలో ఆయన ఆదేశాల మేరకు ఆమెని ఎన్నుకున్నామని అన్నారు. ఇన్నాళ్లు ఎమ్మెల్యే మాట కట్టుబడే ఆమెను కొనసాగిస్తూ వచ్చామని తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం ప్రారంభంలోనే రూ.72 లక్షల నిధులు ఖర్చు చేశామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఎంపిటిసిలకు తెలియకుండా నిధులను దుర్వినియోగం చేస్తోందని, మండల ప్రజలకు అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మండల సర్వసభ సమావేశానికి ఎంపిటిసిల మద్దతు లేకుండానే మండల ప్రత్యేక ఆహ్వానితులుగా టిడిపి కూటమికి చెందిన ఐదుగురిని ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిపించున్నారని అన్నారు. వారు కూడా అర్బన్‌కి చెందినవారని అందుకే తాము సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. సమావేశాన్ని బహిష్కరించిన వారిలో వైస్ ఎంపిపి1 ఖాదర్‌వలీ, వైస్ ఎంపిపి2 రాధ, ఎంపిటిసిలు గౌతమి, ఈశ్వరమ్మ, విమలమ్మ, రమాదేవి, ఎల్లప్ప, రామ సుబ్బారెడ్డి, సుబ్బయ్య నాయుడు, బాలకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులునాసర్ ఉన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ఆర్ఐ వీరాంజనేయులు, ఎంఇఒ రెడ్డిశేఖర్, విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్, అగ్రికల్చర్ ఎఒ చంద్రశేఖర్, హౌసింగ్ శాఖ వర్క్ ఇన్స్‌పెక్టర్ అలీఖాన్ పాల్గొన్నారు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వత్తలూరు గ్రామంలో గురువారం సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన రామాలయంలో వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకలు తెలిపారు. ముందుగా యజ్ఞోపవీతము కలశ స్థాపన తదిత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన అనంతరం అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి : విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ మదనమోహన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్ పై విద్యార్థులకు పోలీస్ సిబ్బంది అవగాహన కలిగించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరుతుందని, ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయడం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ మాట్లాడుతూ, ప్రతీ యువతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా అవసరమని పేర్కొఆన్నరు. కార్యక్రమంలో మహిళా పోలీస్ కల్పన,సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు : ఆంధ్రరాష్ట్రంలో అన్నపూర్ణగా నిత్య అన్నదాతగా పేరుగాంచిన గొప్ప మహనీయులు డొక్కా సీతమ్మ పేరు మీద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ చలివేంద్రంను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు నిత్యాన్నదానం చేసిన అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి పెట్టిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కే దక్కుతుందని అన్నారు. ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంధంగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి, సర్పంచ్ సంయుక్త, గునిపాటి చెన్నారాయుడు, హేమ రాజ్,నవీన్, ముత్యాల కిషోర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి అబ్రహం గురువారం సంచలన తీర్పు వెలువరించారు. డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పటానికి చెందిన అశోక్ (32) మదనపల్లెకు వలస వచ్చి ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం చేసేవాడు. ఆ క్రమంలో స్థానికంగా ఉంటున్న శవాల భాస్కర్ భార్యతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఇది గమనించిన భాస్కర్ అశోక్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. తన స్నేహితులైన వెంకటేష్, కల్యాణ్‌తో కలిసి 2017, ఆగస్టు 22వ తేదీన పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ వెనుక వైపున, ఆంజినేయస్వామి గుడి సమీపంలో అశోక్‌ను హత్య చేశారు. అప్పటి విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రెండో పట్టణ పోలీసులు విచారణ చేపట్టి నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ తర్వాత కోర్టులో విచారణ కొనసాగగా, గురువారం తుది విచారణలో ముద్దాయిలు శవాల భాస్కర్, వెంకటేష్, కల్యాణ్ లపై నేరారోపణ రుజువైంది. ముగ్గురు కలిసి అశోక్‌ను హత్య చేశారని పోలీసులు సాక్షాధారాలతో నిరూపించారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అబ్రహం ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదు శిక్ష విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.11వేలు చొప్పున జరిమానా విధించారు.